సాక్షి
ఏలూరు
బుధవారం । 11 । డిసెంబర్ । 2024



నత్తనడకన ఆలయ నిర్మాణాలు

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా దేవాలయాల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. దీంతో ఆలయాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 10లో ▸



దొంగల ముఠా అరెస్టు

చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. 10లో ▸



లిక్విడ్ గంజాయితో అరెస్టు

లిక్విడ్ గంజాయి కలిగి ఉన్న 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మొగల్తూరు మండలం ముత్యాలపల్లిలో దాడి చేసి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 10లో ▸

ప్రజల పక్షాన పోరుకు సిద్ధం





సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, అన్నదాతలకు అండగా పోస్టర్ విడుదల చేస్తున్న రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యేలు తెల్లం బాలరాజు, తలారి వెంకట్రావు, చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్, పార్టీ నేత ఉమాబాల

- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స పిలుపు
- ఈ నెల 13న రైతు సమస్యలపై, 27న విద్యుత్ చార్జీల పెంపుపై నిరసనలు
- జనవరి 3న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై నిరసనలు
- తణుకులో పార్టీ శ్రేణులకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నేతల దిశానిర్దేశం

సాక్షి, భీమవరం/ తణుకు అర్బన్: కూటమి సర్కారు అరాచక పాలనతో అవస్థలు పడుతున్న రైతులు, విద్యార్థులు, సామాన్యుల పక్షాన పోరాడేందుకు వైఎస్సార్‌సీపీ కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ నెల 13న రైతు సమస్యలపై కలెక్టరేట్ల వద్ద, విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ 27న ఎస్‌ఈ కార్యాలయాల వద్ద, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై జనవరి 3న కలెక్టరేట్ల వద్ద నిరసనలు తెలిపేందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. పార్టీ అధినేత పిలుపు మేరకు తణుకులోని పద్మశ్రీ ఫంక్షన్ హాలులో మంగళవారం ఏర్పాటు చేసిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, ప్రజాప్రతినిధుల సమావేశం విజయవంతంగా జరిగింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాలను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని మండిపడ్డారు. ఆరు నెలలకే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ఘనత కూటమి దక్కించుకుందని, సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో ఈ ఆరు నెలల కాలంలో రూ.35 వేల కోట్ల ప్రభుత్వ లబ్ధిని పేదలు కోల్పోవాల్సి వచ్చిందని బొత్స తెలిపారు. పింఛన్‌లో కేవలం వెయ్యి రూపాయలు పెంచడం మినహా ఈ ప్రభుత్వం వల్ల ప్రజలకు ఒరిగిందేముందని విమర్శించారు. అధికారంలోకి వస్తే రూ. 20 వేలు రైతులకు పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పి ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. విద్యుత్ చార్జీలు రూపాయి కూడా పెంచబోమని చెప్పిన చంద్రబాబు ట్రూఅప్ చార్జీల పేరిట ప్రజలపై భారం మోపారని విమర్శించారు. తమ ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలపై విద్యుత్ భారం పడకుండా రూ.45,800 కోట్లను సర్దుబాటు చేశారన్నారు. ఈ ఆరు నెలల కాలంలో రూ.60 వేల కోట్లు అప్పు తెచ్చిన కూటమి ప్రభుత్వం ఆ నిధులను ఏం చేసిందని బొత్స ప్రశ్నించారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేశారని బొత్స తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు కావస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయక కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగిపోయి పేదల జీవితం దుర్భరంగా మారిందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు డిమాండ్ చేస్తామన్నారు. రైతులు, విద్యార్థులు, సామాన్యుల పక్షాన చేపట్టనున్న ఉద్యమాలకు సంబంధించిన పోస్టర్‌ను బొత్స, నాయకులు ఆవిష్కరించారు. సమావేశంలో ఏలూరు, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లు కారుమూరి సునీల్‌కుమార్, గూడూరి ఉమాబాల, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు తెల్లం బాలరాజు, పుప్పాల వాసుబాబు, మామిడిపల్లి జయప్రకాష్, కంభంపాటి జయరాజు, తలారి వెంకట్రావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథ్, రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్ఆర్‌సీపీ మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడదాం

ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ పశ్చిమ గోదావరి అధ్యక్షుడు



కూటమికి ఓటేసి ప్రజలు మోసపోయి ఇబ్బందులు పడుతున్నారు. రైతులు, విద్యార్థులు, సామాన్యుల ఇబ్బందులపై వారి పక్షాన పోరాటం చేయాలని మన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. రైతుల సమస్యలపై ఈ నెల 13న కలెక్టరేట్‌ల వద్ద శాంతియుతంగా నిరసన తెలపాలి. విద్యుత్ సమస్యలపై 27న ఎస్‌ఈ కార్యాలయం వద్ద వినతులు అందజేయాలి. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై జనవరి 3న కలెక్టరేట్ వద్ద నిరసన తెలపాలి. పార్టీని జిల్లా, మండల, గ్రామ స్థాయి వరకు సంస్థాగతంగా బలోపేతం చేసుకుంటూనే ప్రజా సమస్యలపై పోరాటం సాగించాలి.

ప్రభుత్వం కళ్లు తెరిపించాలి

దూలం నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు



కరెంటు చార్జీల పేరిట ఈ ప్రభుత్వం ప్రజల నెత్తిన రూ.15 వేల కోట్ల భారం మోపింది. విద్యార్థుల ఉన్నత భవిష్యత్ కోసం వైఎస్ జగన్ అమలు చేసిన విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు చరమగీతం పాడింది. ప్రజలకు పెనుభారంగా మారిన సమస్యలపై జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ప్రజల తరఫున మనం పోరాటం చేయాలి. ప్రభుత్వం కళ్లు తెరిపించేలా కలెక్టరేట్, విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయాల వద్ద కార్యక్రమాలు నిర్వహించి వినతులు ఇచ్చే కార్యక్రమాలకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలి.

ఆరు నెలల్లో అరాచకం..

తానేటి వనిత, మాజీ మంత్రి



పార్టీ అధినేత పిలుపు మేరకు ప్రజా సమస్యలపై చేపట్టిన పోరాటాలను విజయవంతం చేయాలి. ఆరు నెలల కాలంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను అందరూ చూస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని కేసులతో వేధిస్తున్నారు. కార్యకర్తలు అండగా నిలవాలని పార్టీ అధ్యక్షుడు జగన్ నేతలకు సూచించారు.

సూపర్ సిక్స్ అమలు ఎప్పుడు ?

కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ



కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయడం లేదు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని ప్రజలు గమనిస్తున్నారు. విద్యుత్ చార్జీలు, నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజలకు భారంగా మారాయి. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ప్రజల తరపున పోరాటాలను విజయవంతం చేయాలి.

పార్టీ బలోపేతానికి కృషి

వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ



రీజనల్ కోఆర్డినేటర్‌గా బొత్స సత్యనారాయణ సారథ్యంలో నాయకులకు, కార్యకర్తలకు మంచి నెట్‌వర్క్ ఏర్పడుతుంది. జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో పార్టీ మరింత బలోపేతం అవుతుంది. ఇద్దరు నేతలు ఇచ్చే సూచనలను కేడర్ పాటిస్తూ పార్టీని బలోపేతానికి కృషిచేయాలి.

అధ్వానంగా రోడ్లు

చిర్ల జగ్గిరెడ్డి, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే



కూటమి ప్రభుత్వంలో రోడ్లు అధ్వానంగా మారాయి. కనీస మరమ్మతులు కూడా చేయడం లేదు. ఆరు నెలలు గడవక ముందే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చింది. ఈ తరుణంలో ప్రజా సమస్యలపై పోరాడే వైఎస్సార్‌సీపీ శ్రేణుల కోసం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వీరికి అండగా నిలవాల్సిన బాధ్యత మనపై ఉంది.

రైతులను మోసగించిన బాబు

కారుమూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి



చంద్రబాబు నాయుడు నిజం చెప్పడని.. ఆయన నిజం చెబితే తలకాయ వెయ్యి చెక్కలవుతుందని దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఆనాడే చెప్పారు. రైతు భరోసా సాయంగా రూ.13,500 రైతులకు జగన్ మోహన్ రెడ్డి అందించేవారు. అధికారంలోకి వస్తే రూ. 20 వేలు ఇస్తానని చెప్పి చంద్రబాబు రైతులను మోసం చేశారు. బీమా చేయని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. దళారీ వ్యవస్థకు చంద్రబాబు ఆజ్యం పోయడంతో రైతులు నష్టపోతున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, బీమా వంటి వాటికి ఎగనామం పెట్టారు. మన పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వాటిని కప్పిపుచ్చుకోవాలని చూస్తున్నారు.

మిల్లర్లదే రాజ్యం

కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి



వర్షాలతో పంట మునిగి, రంగు మారిన ధాన్యంతో రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రైతులకు నేటి వరకు పెట్టుబడి సాయం కింద ఒక్క రూపాయి ఇవ్వలేదు. మిల్లర్లు చెప్పినట్లు ఆడేలా వ్యవస్థను చంద్రబాబు మార్చేశారు. సివిల్ సప్లయిస్ మినిస్టర్ ఉన్నా, ఆ శాఖ కంట్రోల్ అంతా ఉపముఖ్యమంత్రి చేతిలోనే ఉంది. వైఎస్సార్‌సీపీ రైతుల పక్షాన అండగా నిలబడుతుంది. ఒక్క రూపాయి విద్యుత్ చార్జీలు పెంచమని ప్రజలను నమ్మించి మోసం చేసి వేల కోట్ల రూపాయల భారం మోపారు. ఎస్సీ, ఎస్టీలకు ఉన్న 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పథకానికి కూడా తూట్లు పొడిచారు.

న్యూస్‌రీల్

జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ద్విచక్రవాహన చోదకులు వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం మోటారు వాహన తనిఖీ అధికారులు జిల్లా వ్యాప్తంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ రహిత డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపుతున్న చోదకులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 104 కేసులు నమోదు చేసి రూ.2.30 లక్షల జరిమానా విధించామన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై నిత్యం తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాలిక ప్రసవంపై దర్యాప్తు చేయాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు అశోక్ నగర్‌లోని మిషనరీ వసతి గృహంలో బాలిక ప్రసవం ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి, దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. బాలిక గర్భవతి అయినా పట్టించుకోకపోవడం దుర్మార్గమని, దీనికి ఆ సంస్థ నిర్వాహకుల నిర్లక్ష్య వైఖరే కారణమని విమర్శించారు. రోజురోజుకు మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలే దయానంద సరస్వతి బాలికల వసతి గృహంలో ఘటనను మర్చిపోకముందే ఇంకో ఘటన వెలుగులోకి రావడం ఆందోళన కల్గిస్తోందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఉప వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ నియామకం

ఏలూరు (టూటౌన్): షెడ్యూల్డ్ కులాల్లోని ఉప వర్గీకరణపై విచారణకు రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారని సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకుడు వి.జయప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ మొఘల్రాజపురంలో ఉన్న గిరిజన సంక్షేమ ప్రధాన కార్యాలయం మొదటి అంతస్తులో ఆఫీసు ఏర్పాటు చేశారని వినతిపత్రాలు కార్యాలయం పనివేళల్లో సమర్పించాలని కోరారు.

కేంద్రీయ విద్యాసంస్థలతో నిట్ ఒప్పందం



ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్‌వీ రమణరావు తదితరులు

తాడేపల్లిగూడెం: ఏపీ నిట్ మంగళవారం మూడు కేంద్రీయ విద్యాసంస్థలతో ఎంఓయు కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డైరెక్టర్ రమణరావు మాట్లాడుతూ నిట్ విద్యార్థులు భాగస్వామ్యాన్ని మరింతగా పెంచాలనే ఉద్దేశంతో మూడు కేంద్రీయ విద్యాసంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. ఎంఓయు ద్వారా బీటెక్ చదువుతున్న మూడు నాలుగు సంవత్సరాల విద్యార్థులతో పాటు డిప్లమో ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంటు కోర్సులు చేస్తున్న విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. విశాఖపట్నానికి చెందిన ఐఐఎం, మణిపూర్, రాయపూర్ (చత్తీస్‌గఢ్)లోని ఎన్ఐటీలతో ఎంఓయూలు జరిగాయి. నిట్ డైరెక్టర్ రమణరావు, ఐఐఎం డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, మణిపూర్ నిట్ డైరెక్టర్ డాక్టర్ డీవీఎల్ సోమయాజులు ఎంఓయులపై సంతకాలు చేశారు.

సందేశాత్మకంగా నాటిక పోటీలు



నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత? నాటికలో సన్నివేశం

వీరవాసరం: శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ తోలేరులో నిర్వహిస్తున్న 20వ జాతీయ స్థాయి నాటిక పోటీలు మంగళవారం సందేశాత్మకంగా సాగాయి. తెలుగు కళా సమితి విశాఖపట్నం వారి నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత? నాటిక మొదటి ప్రదర్శనగా సాగింది. రెండో ప్రదర్శనగా సద్గురు కళా నిలయం గుంటూరు వారి కమనీయం నాటిక ప్రదర్శన సాగింది.

మానవ హక్కుల చట్టం మైలురాయి



మానవహక్కుల దినోత్సవ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ రత్నప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మానవ అభివృద్ధికి మానవ హక్కుల చట్టం మైలురాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే రత్న ప్రసాద్ అన్నారు. స్థానిక సత్రంపాడులోని జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ మానవ హక్కులు, గౌరవం లేనప్పుడు స్థిరమైన అభివృద్ధి సాధ్యం కాదని, సుస్థిర అభివృద్ధి, మానవ హక్కులు పరస్పరం ఆధారపడి ఉంటాయన్నారు. అందరికీ సమాన హక్కు హామీ ఇవ్వడం ద్వారా భారతదేశం రోల్ మోడల్‌గా ఉండేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఈ చట్టం ద్వారా ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా జీవించడానికి, మాట్లాడడానికి అభివృద్ధి చెందడానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. నేటి సమాజంలో మాదకద్రవ్యాలు యువతపై దుష్ప్రభావం చూపిస్తున్నాయని, విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. చెడు స్నేహాలకు పోకుండా విద్యపై దృష్టి ఉంచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు మూడో పట్టణ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు, ప్యానల్ లాయర్లు కూన కృష్ణారావు, పీ. వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి

ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్



ట్రిపుల్‌ఐటీలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య ఎం.విజయ్‌కుమార్

నూజివీడు: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అధ్యాపకులు, విద్యార్థుల్లో అవగాహన పెంపొందింపచేయడమే లక్ష్యంగా ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన టిహాన్ సహకారంతో ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీలో శిక్షణ కార్యక్రమాన్ని వైస్ చాన్సలర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోబోటిక్స్ ఫర్ అటానమస్ నేవిగేషన్‌పై శిక్షణ ఇస్తారన్నారు. సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు, డ్రోన్‌లు, రోబోట్‌లు స్వయం ప్రతిపత్తి రంగాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. ముందుగా 50 మంది అధ్యాపకులకు శిక్షణనిస్తున్నామని, అనంతరం 400 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు. ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ రామస్వామి మాట్లాడుతూ ఇంజినీరింగ్ టెక్నాలజీలో రోజురోజుకు కొత్త మార్పులు వస్తున్నాయని.. దీనికి అనుగుణంగా ఇంజినీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు మారాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, ఏఓ బీ లక్ష్మణరావు, ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రాం కన్వీనర్లు పీ శ్యామ్, రియాజ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బయ్య చౌదరికి అండగా ఉంటాం

కారుమూరి సునీల్‌కుమార్

ఏలూరు టౌన్: దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఇంటిముందు అక్రమ ఆందోళలను ప్రోత్సహించడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. ప్రశాంతంగా ఉండే గ్రామాల్లో విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. టీడీపీ నేతలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ అబ్బయ్య చౌదరి ఇంటిముందు ఆందోళన చేయిస్తూ అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. భౌతిక దాడులు, ఆస్తుల విధ్వంసం ఎన్ని అరాచకాలు చేసినా బెదిరేది లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి అండగా ఉంటామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇలా గ్రామాల్లో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతుందని ఆరోపించారు.

లెక్కల టీచర్‌పై ఏం చర్యలు తీసుకున్నారు?

ఎస్పీకి ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్ నోటీసులు

ద్వారకాతిరుమల: స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులను దారుణంగా కొట్టడమేకాకుండా కులం పేరుతో దూషించిన లెక్కల టీచర్ ఎంఎస్‌వీ ముత్యాలరావుపై అధికారులకు ఫిర్యాదు చేసినా, ఆయనపై చర్యలు తీసుకోలేదని షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్‌కు ఈ నెల 6న బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్ ఎస్పీకి మంగళవారం నోటీసులు జారీ చేశారు. తన పిల్లలను ఉపాధ్యాయుడు ముత్యాలరావు కొట్టి, కులం పేరుతో దూషించారని, వెంటనే ఆయనను అరెస్టు చేయాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ అధ్యక్షుడు బేతాళ సుదర్శనం సహకారంతో తల్లిదండ్రులు జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బాలుడు త్రివిక్రమ్ ఎడమ కాలు విరిగిందని.. ఉపాధ్యాయుడి వల్ల పాఠశాలకు వెళ్లేందుకు భయపడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలిక సహస్రను సైతం కొట్టి దూషించిన ముత్యాలరావుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఎంఈఓ, ఎస్ఐ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఏవిధమైన చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరారు.

రెవెన్యూ సదస్సులు విజయవంతం చేయాలి

ఏలూరు(మెట్రో): రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలోని 657 గ్రామాల్లో ఈ నెల 11 నుంచి జనవరి 8 వరకు జరగనున్న రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి అర్జీని స్వీకరించాలన్నారు. మనమందరం ప్రభుత్వ ఉద్యోగులమని నిబద్ధతతో ప్రజలకు సేవలందించాలన్నారు. సామాజిక సమస్యలు, వ్యక్తిగత సమస్యలు నిబద్ధతతో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ స్థాయి సదస్సుకు కలెక్టర్ నియమించిన నోడల్ అధికారులందరూ హాజరుకావాలని సూచించారు. పీజీఆర్ఎస్ సైట్‌లో ఫిర్యాదు తక్షణ నమోదు చేపట్టాలన్నారు. మ్యుటేషన్ సేవను చేపట్టడానికి సంబంధిత రిజిస్టర్ తీసుకెళ్లాలన్నారు. గ్రామాన్ని రెవెన్యూ సమస్య లేని గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సదస్సులు విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

బాలిక ప్రసవం ఘటనలో నివేదికకు ఆదేశం

ఏలూరు టౌన్: ఏలూరు అశోక్‌నగర్‌లోని మిషనరీ వసతి గృహంలో బాలిక ప్రసవం... నవజాత శిశువును బయటకు విసిరివేయడంపై రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సీరియస్‌గా స్పందించింది. ఈ సంఘటనపై సమగ్ర నివేదికను మూడు రోజుల్లో రాష్ట్ర కమిషన్‌కు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు, కమిషన్ సభ్యులు డాక్టర్ జంగం రాజేంద్రప్రసాద్ విజయవాడ నుంచి మాట్లాడుతూ... ఈ సంఘటనను బాలల హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించిందని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం మూడు రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. బాలికల వసతిగృహాలకు సంబంధించి వసతిగృహం నిర్వాహకులు, అక్కడి సిబ్బంది నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో బాలల సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారో చెప్పాలన్నారు.

క్లుప్తంగా

లిక్విడ్ గంజాయి కలిగిన పదిమంది అరెస్ట్

మొగల్తూరు: లిక్విడ్ గంజాయి కలిగి ఉన్న 10 మంది యువకులను అరెస్ట్ చేశామని, మరో నిందితుడు పరారీలో ఉన్నాడని నరసాపురం డీఎస్పీ జి శ్రీ వేద తెలిపారు. మంగళవారం మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలోని ముత్యామణి లోహిత వైష్ణవి భోజన శాల సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం సమయంలో కొందరు యువకులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారనే సమాచారంతో సీఐ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై జి వాసు, తన సిబ్బందితో దాడి చేసి వారిని అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 135.198 మిల్లీ గ్రాముల 19 గంజాయి లిక్విడ్ సీసాలను, 8 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని, గంజాయి విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.95 వేలు ఉంటుందని తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం చోరంపూడి గ్రామానికి చెందిన పొన్నమండ కృష్ణప్రసాద్, రామాని కుసుల్ దుర్గ, మచిలీపట్నంలోని గిలకలదిండికి చెందిన వల్లభుని గోపాలకృష్ణ,రామాని మనోజ్ కుమార్, మొగల్తూరు మండలం ముత్యాలపల్లి కి చెందిన దొంగ ప్రసాద్, నరసాపురం పట్టణానికి చెందిన కొల్లాటి వాసుదేవ్, జోళ్యల సుబ్రహ్మణ్యం విశ్వేశ్వర, కర్రి ఆదిత్య వినాయక పవన్ కుమార్, మొగల్తూరుకు చెందిన చదలవాడ కృపావరం, ఇరగవరం మండలం కాకిలేరుకు చెందిన వీరవల్లి సుధీర్ ఉన్నారని, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితుల్లో 6 గురు వ్యక్తులపై వివిధ స్టేషన్‌లలో కేసులున్నాయన్నారు.

అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ద్వారకాతిరుమల: ఒక వివాహితపై అత్యాచార యత్నం చేసిన వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మెట్టపంగిడిగూడెంకు చెందిన తోళం దుర్గా భవాని అనారోగ్య సమస్యలకు చికిత్స నిమిత్తం సోమవారం ఉదయం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లింది. వైద్యం చేయించుకున్న అనంతరం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైంది. ఈ క్రమంలో పంగిడిగూడెం వద్ద బస్సు దిగి, స్వగ్రామానికి నడుచుకుంటూ వెళుతుండగా అదే సమయంలో అటుగా వచ్చిన మెట్ట పంగిడిగూడెంకు చెందిన అంజిబాబు గ్రామంలో దింపుతానని ఆమెను తన స్కూటీ ఎక్కించుకున్నాడు. కొంతదూరం వెళ్లిన తరువాత పుంతరోడ్డులోని ఒక అరటి తోటలోకి తీసుకెళ్లి, అత్యాచారానికి యత్నించాడు. అతడి నుంచి తప్పించుకున్న దుర్గా భవాని పక్క పొలాల్లోని రైతులకు విషయాన్ని చెప్పి, వారి సహాయంతో గ్రామంలోకి చేరుకుంది. అదేరోజు రాత్రి స్థానిక పోలీస్టేషన్‌కు వెళ్లి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేయగా, ఎస్సై టి.సుధీర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. నిందితుడు వీరవల్లి అంజిబాబు టీడీపీ కార్యకర్త కాగా, అతడు పార్టీకి చెందిన వ్యక్తి కాదని ఆ పార్టీ నేతలు చెబుతుండడం గమనార్హం.

● వైభవంగా తెప్పోత్సవం



షష్ఠి ఉత్సవాల్లో భాగంగా సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం రాత్రి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న పుష్కరిణిలో హంస వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ప్రధాన అర్చకుడు వీరభద్రశర్మ, సహాయ కమిషనర్ ఆర్ గంగాశ్రీదేవి, పాలకవర్గ సభ్యులు పూజలు నిర్వహించారు. రూరల్ సీఐ వి రవికుమార్, ఎస్సై వీరభద్రరావు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. – ముదినేపల్లి రూరల్

● ఉద్యోగుల నిరసన గళం



సీపీఎస్ పెన్షన్ విధానం రద్దు కోరుతూ ఉద్యోగులు నిరసన గళం వినిపించారు. విజయవాడలో మంగళవారం తలపెట్టిన ధర్నాకు ఏపీసీపీఎస్ ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్ నాగ దుర్గారావు ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం నుంచి ఉద్యోగులు తరలివెళ్లారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం నాడు ఉద్యోగుల హక్కు అయిన పెన్షన్ కోసం ధర్నా చేస్తున్నట్లు దుర్గారావు తెలిపారు. పెండింగ్ అరియర్లు విడుదల చేయాలని జిల్లా మహిళా అధ్యక్షురాలు బి.మోహన డిమాండ్ చేశారు. – జంగారెడ్డిగూడెం

● రైతుల కష్టం నీళ్లపాలు



ఆరుగాలం శ్రమించి పండించిన రైతుల కష్టం నీలపాలైయింది. ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ మంగళవారం ఉదయం జుత్తిగ జిల్లాపరిషత్ రహదారిలో పెనుమంట్ర రజకుల చెరువులోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ధాన్యం బస్తాలు తడిసిముద్దయ్యాయి. వెలగలవారిపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు చెందిన 250 బస్తాల ధాన్యాన్ని బ్రాహ్మణచెర్వు రైస్ మిల్లుకు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు వీఆర్వో రాజు తెలిపారు. – పెనుమంట్ర

నత్తనడకన ఆలయ నిర్మాణాలు

- ఆలయాల అభివృద్ధిపై దృష్టి సారించని కూటమి ప్రభుత్వం
- జగన్ ప్రభుత్వంలో జిల్లాలో 36 ఆలయాల పునర్నిర్మాణం
- సీజీఎఫ్ గ్రాంట్ నుంచి రూ.20.95 కోట్లు కేటాయింపు

భీమవరం (ప్రకాశంచౌక్): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు దేవాలయాల అభివృద్ధి పనులపై దృష్టి సారించడం లేదు. దీంతో ఆలయాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో హిందూ దేవాలయాల అభివృద్ధికి పెద్ద పీట వేశారు. పురాతన ఆలయాల అభివృద్ధే లక్ష్యంగా దేవస్థానాల జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టారు. దెబ్బతిన్న ఆలయాలు, వాటి ప్రాంగణాలు, పరిసరాలను పునర్నిర్మాణం చేసి ఆలయాలకు పూర్వ వైభోగం తీసుకురావాలని సంకల్పించారు. అందుకోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసి నూతన ఆలయాల నిర్మాణాలకు చర్యలు తీసుకున్నారు.

ఆలయాల నిర్మాణాలకు సీజీఎఫ్ గ్రాంట్ నిధుల విడుదల

గత జగన్ ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా 36 ఆలయాల పునర్నిర్మాణాలను చేపట్టింది. ఇందుకోసం సీజీఎఫ్ గ్రాంట్ (కామన్ గుడ్ ఫండ్) నుంచి 36 ఆలయాలకు రూ.20.95 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఆలయాల నిర్మాణానికి అయ్యే ఖర్చులో 67 శాతం నిధులు ప్రభుత్వం అందించగా 33 శాతం మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ దేవస్థానం తరపున ఖర్చు చేసేలా చర్యలు తీసుకుంది. ఆదాయం తక్కువగా ఉన్న ఆలయాలకు మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ నిధులకు దాతలు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ప్రభుత్వం సీజీఎఫ్ గ్రాంట్ నుంచి ఆయా ఆలయాల సామర్థ్యం బట్టి నిర్మాణానికి రూ.13 లక్షల నుంచి రూ.1.50 కోట్ల వరకు నిధులు మంజూరు చేసింది. అన్నింటితో కలుపుకుని రూ.28.97 కోట్లతో జిల్లాలో 36 ఆలయాల పునర్నిర్మాణ పనులు జరిగాయి.



భీమవరంలో నిర్మాణంలో ఉన్న సీతారామలింగేశ్వరస్వామి దేవస్థానం

సమీక్షలు సైతం లేవు

గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఈఏడాది ఏప్రిల్ వరకు నిర్మాణాలు వేగంగా జరిగాయి. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడంతో నిర్మాణాల్లో జాప్యం చోటుచేసుకుంది. జూలై నుంచి నవంబరు వరకు ఇసుక కొరతతో నిర్మాణాలు నిలిచిపోగా, ప్రస్తుతం ఇసుక లభిస్తున్నప్పటికి ఆలయాల నిర్మాణం వేగంగా జరిగేలా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. దేవదాయశాఖ సైతం వీటిగురించి పట్టించుకోవడం లేదు. దీంతో ఆలయాల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. గత ప్రభుత్వంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మంత్రులు వారి పరిధిలో ఉన్న ఆలయాల నిర్మాణం వేగంగా జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు, మంత్రులు ఆలయాల పునర్నిర్మాణ పనులు వేగంగా జరిగేలా కనీసం అధికారులతో సమీక్షించిన దాఖలాలు సైతం కనబడడం లేదు.

గత ప్రభుత్వంలో ఆలయాలకు మంజూరైన నిధులు

ఆలయం	ప్రాంతం	నిధులు రూ. లక్షల్లో
సీతారామలింగేశ్వరస్వామి దేవస్థానం	భీమవరం	రూ.66.66
పాలేశ్వరస్వామి దేవస్థానం	ఇరగవరం	21.66
కనకదుర్గమ్మ దేవస్థానం	బి.కొండేపాడు	44.66
శివ కేశవస్వామి దేవస్థానం	కొమరాడ	66.66
సోమేశ్వరస్వామి దేవస్థానం	ఎల్చిచర్ల	44.66
చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానం	చెరుకువాడ	60.00
వేణుగోపాలస్వామి దేవస్థానం	చెరుకువాడ	60.00
రామలింగేశ్వరస్వామి దేవస్థానం	జక్కరం	66.66
కోదండ రామాలయం	చిలుకూరు	90.00
రామలింగేశ్వరస్వామి దేవస్థానం	నవుడూరు	60.00
ముత్యాలమ్మ దేవస్థానం	ముత్యాలంబపురం	66.66
రామేశ్వరస్వామి దేవస్థానం	వెలగలేరు	100.00
సోమేశ్వర దేవస్థానం	కవిటం	18.00
గోపాల ఆంజనేయస్వామి దేవస్థానం	కె.పెంటపాడు	80.00
ముత్యాలమ్మ దేవస్థానం	ఆకుతీగపాడు	13.33
గౌరీదేవి దేవస్థానం	పెంటపాడు	66.66
విశ్వేశ్వరస్వామి దేవస్థానం	వల్లూరిపల్లి	150.00

ఆలయం	ప్రాంతం	నిధులు రూ. లక్షల్లో
రామాలయం	దర్శిపర్రు	46.66
లక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానం	రేలంగి	53.33
మదనగోపాలస్వామి దేవస్థానం	కొయ్యేటిపాడు	46.66
అలుసులమ్మ దేవస్థానం	కృష్ణాపురం	40.00
కోదండరామస్వామి దేవస్థానం	రామారావుపేట	66.00
గణపతి సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం	కడియద్ద	66.00
దేశాలమ్మ దేవస్థానం	కుంచనపల్లి	33.34
వేంకటేశ్వరస్వామి దేవస్థానం	తాడేపల్లిగూడెం	58.50
రామాలయం	పడమర విప్పర్రు	33.33
వేణుగోపాలస్వామి దేవస్థానం	దువ్వ	13.30
రామలింగేశ్వరస్వామి దేవస్థానం	కోపల్లె	100.00
బాల వేంకటేశ్వరస్వామి దేవస్థానం	పెంటపాడు	54.00
జనార్ధనస్వామి దేవస్థానం	తూర్పు విప్పర్రు	8.00
కోదండరామస్వామి దేవస్థానం	తాడేపల్లిగూడెం	5.00
తాండవేశ్వరస్వామి దేవస్థానం	ఆరేడు	55.83
కేశవస్వామి దేవస్థానం	ఆరేడు	45.22

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



మహేశ్వరి (ఫైల్)

కామవరపుకోట: విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన ఘటన కామవరపుకోట మండలం వడ్లపల్లి గ్రామంలో జరిగింది. తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు తెలిపిన వివరాల ప్రకారం కస్సే మహేశ్వరి (27) సోమవారం మధ్యాహ్నం తన పుట్టిల్లు అయిన తడికలపూడి నుంచి వడ్లపల్లి గ్రామంలోని తన ఇంటికి వచ్చి బ్యాగ్‌లోని దుస్తులు పెట్టేందుకు బీరువాను తెరిచింది. అప్పటికే బీరువాకు విద్యుత్ ప్రసరణ వస్తుండడంతో ఆమె బీరువాను తాకగానే విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో స్థానికులు గమనించి ఆమె బంధువులకు, తడికలపూడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై చెన్నారావు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త కిషోర్, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తల్లిని చూడని కుమారులకు కౌన్సెలింగ్

అత్తిలి: వృద్ధురాలైన తల్లిని చూడని ఇద్దరు కుమారులకు తహసీల్దార్ దశిక వంశీ కౌన్సెలింగ్ ఇచ్చారు. తన ఇద్దరు కుమారులు చూడటంలేదంటూ తిరుపతిపురం శివారు శివపురం గ్రామానికి చెందిన గుడిమెట్ల సర్రమ్మ అత్తిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్సై పి ప్రేమరాజు తహసీల్దార్ కోర్టులో కేసు దాఖలు చేశారు. దీంతో మంగళవారం తహసీల్దార్ దశిక వంశీ సర్రమ్మ కుమారులు కోట నాగేశ్వరరావు, సుబ్బారాయుడిని పిలిపించి మందలించారు. తల్లి సర్రమ్మను సరిగా చూసుకునేలా వారి నుంచి ష్యూరిటీ బాండ్లు తీసుకున్నారు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

వేలేరుపాడు: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికి న్యాయం చేస్తాయోనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. వేలేరుపాడు సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్, కందుకూరు స్వర్ణ అధ్యక్షతన పోలవరం నిర్వాసితుల మహాసదస్సు మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి, సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మండలాన్ని యూనిట్‌గా తీసుకొని, భూసేకరణ చేసి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, అన్ని అర్హతలు ఉన్నప్పటికీ అనర్హులుగా పేర్కొన్న స్థానికులకు ప్యాకేజీ వర్తింపచేయాలన్నారు, ప్రతి కుటుంబానికి ఇచ్చే అన్ని రకాల ప్యాకేజీలు ఒకేసారి ఇవ్వాలని, వివాదాస్పదం లేని భూములను గిరిజనులకు ఇవ్వాలని, కట్ ఆఫ్ తేదీలతో సంబంధం లేకుండా తరలించే నాటికి 18 ఏళ్లు నిండిన యువతి యువకులకు ప్యాకేజీ ఇవ్వాలని, డిమాండ్ చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు జిరాయితీ భూములు మాదిరిగానే నష్ట పరిహారం ఇవ్వాలని, పునరావసం కాలనీలలో ఉపాధి చూపించాలన్నారు, సర్వేల అవకతవకలను వెంటనే సరి చేయాలన్నారు, మిగులు భూములను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నాయకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సదస్సులో జాతీయ సమితి సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

దొంగల ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శివకిషోర్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్



పోలీసులు స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

- రెండు కేసుల్లో రూ.88,73 లక్షల చోరీ సొత్తు రికవరీ

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతూ బంగారు, వెండి వస్తువులు, నగదును అపహరిస్తున్న దొంగల ముఠాను గణపవరం సర్కిల్, ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి భారీ ఎత్తున బంగారు ఆభరణాలు, ఏడు కిలోల వెండి వస్తువులు, రూ.63 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ వివరాలు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం పెద కాపవరం గ్రామానికి చెందిన కట్టెడ్డి మణికంఠ సాయి శ్రీనివాస్, యార్లపాటి మానీ సన్నీ అలియాస్ సన్నీ, పెద్ద హేమకుమార్ అలియాస్ హేమంత్, పెద్దిరెడ్డి రత్నశేఖర్ అనే నలుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఈ ముఠాపై ఉమ్మడి పశ్చిమలోని గణపవరం, భీమడోలు, ఉండి, ఆకివీడు పోలీస్‌స్టేషన్లలో 10కి పైగా కేసులు నమోదు అయ్యాయి. దీంతో ఈ చోరీ కేసులకు సంబంధించి నిడమర్రు సీఐ ఎం.సుభాష్, భీమడోలు సీఐ యూజే విల్సన్, ఎస్సై మణికుమార్, చేబ్రోలు ఎస్ఐ సూర్యభగవాన్, నిడమర్రు ఎస్సై ఎన్.వీరప్రసాద్ బృందాలుగా ఏర్పడి మంగళవారం ఈ దొంగల ముఠాను పట్టుకున్నారు. ఈ ముఠా నుంచి 700 గ్రాముల బంగారు ఆభరణాలు, ఏడు కిలోల వెండి వస్తువులు, రూ.63 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారుగా రూ.70 లక్షల వరకూ ఉంటుందని పోలీసుల అంచనా.

మరో కేసులో కేర్ టేకర్ అరెస్ట్

ఏలూరు ఒక ఇంట్లో కేర్‌టేకర్‌గా పనిచేస్తూ ఆ ఇంట్లో బంగారు ఆభరణాలు దొంగతనం చేస్తున్న మహిళను మంగళవారం ఏలూరు త్రీటౌన్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం స్థానిక శాంతినగర్‌లో మురళీ హార్మోనీ అపార్ట్‌మెంట్స్‌లో యర్రంశెట్టి సురేష్ నివాసం ఉంటున్నాడు. అతని తల్లికి కేర్ టేకర్‌గా ఏలూరు సత్రంపాడు ప్రాంతానికి చెందిన చింత అనిత వెంకటలక్ష్మి అలియాస్ అనితను పనికి పెట్టుకున్నారు. ఆమె ఇంటిలో పనిచేస్తూ బీరువాలోని బంగారు ఆభరణాలను ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒక్కొక్కటిగా చోరీ చేస్తూ ఉంది. ఆ బంగారు ఆభరణాలను ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో తాకట్టుపెట్టి డబ్బులు తీసుకుంటుంది. అనుమానం వచ్చిన యజమాని బీరువాను పరిశీలించగా బంగారు ఆభరణాలు అపహరణ కావడాన్ని గమనించి నవంబర్ 30న ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ఏలూరు త్రీటౌన్ సీఐ ఎస్.కోటేశ్వరరావు, ఎస్సై పీ.రాంబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. నిందితురాలిని ఆమె ఇంటివద్ద అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితురాలు అనిత నుంచి 302.50 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.18,73,500 ఉంటుందని అంచనా. ఈ కేసుల్లో ప్రతిభ చూపిన డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌తోపాటు ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, నిడమర్రు సీఐ సుభాష్, ఎస్సైలు, పోలీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాన్ని ఎస్పీ అందజేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పాలకొల్లు అర్బన్: వెలివెల గ్రామానికి చెందిన పెనుమాల రాంబాబు (45) సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో రాంబాబు ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్సై సురేంద్రకుమార్ తెలిపారు.